క్లుప్తంగా

మారిన సిలబస్ తగ్గించాలంటూ వినతి



విజయవాడ వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయులు నాయకులు

బిక్కవోలు: విద్యార్థులకు మారిన సిలబస్ తగ్గించాలంటూ విజయవాడలో రాష్ట్ర ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ముల్లు రఘునాథరెడ్డికి వినతి పత్రం అందించారు. శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర ఎస్టీయూ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాష్ట్ర ఎస్టీయూ ఆర్థిక కమిటీ సభ్యులు తమలంపూడి ఈశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీయూ పురపాలక కమిటీ సభ్యులు వర్ధినేని పళ్లంరాజు సంయుక్తంగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో 9, 10 తరగతి హిందీ, సాంఘికశాస్త్రం సబ్జెకులో సిలబస్ అధికంగా ఉండడం, విద్యార్థుల స్థాయికి మించి సిలబస్‌ను పెట్టడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీసం ఈ సంవత్సరం కొన్ని టాపిక్‌లు తగ్గించాలని కోరారు. విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రాష్ట్ర ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ముల్లు రఘునాథరెడ్డికు తెలియజేశారు.

రంగంపేటలో పారిశుధ్య పనులు



రంగంపేటలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

రంగంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందు జాగ్రత్తల్లో భాగంగా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీఓ పి.వెంకటరత్నం తెలిపారు. మండలంలోని రంగంపేట, మర్రిపూడి, ఈలకొలను తదితర గ్రామాల్లో ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచికారీ చేయించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

పెదపూడి తహసీల్దార్‌గా సీతాపతి బాధ్యతల స్వీకరణ



సీతాపతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్వో రమేష్, ఏడుకొండలు తదితరులు

పెదపూడి: స్థానిక తహసీల్దార్‌గా సీతాపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ అర్బన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇంతవరకు తహసీల్దార్‌గా పని చేసిన రాజ్‌కుమార్ తిరిగి ఏలూరు వెళ్లిపోవడంతో ఆ స్థానంలో సీతాపతి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ రామ్‌కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కర్రెడ్ల రమేష్, ఏడుకొండలు, గణపతి, భాగయ్య, పంపన శ్రీను, తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

కూలిన కల్వర్టు

- రాకపోకలకు అంతరాయం
- పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల



కూలిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, తదితరులు

రాజానగరం: నందరాడ నుంచి కలవచర్ల, కోరుకొండ మండలం, గాదరాడలకు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. ఇదే సమయంలో రోడ్డు కూడా అటు ఇటు కొంత మేరకు పెచ్చులూడి విరిగిపోయింది. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో ఎక్కువ వ్యవసాయాధారిత కుటుంబాలు ఉండడంతో జీవనోపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ముంపు నీటి ఉధృతికి కల్వర్టు కూలిపోవడంతో గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ముందస్తు చర్యలు లేకుంటే ముప్పే

- ఏటిగట్టుకు పొంచి ఉన్న ప్రమాదం
- బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి జాలిమూడి శివారుకు బలహీనపడిన గట్టు
- వచ్చే ఏడాదికి గండిపడే అవకాశం
- అదే జరిగితే ముంపు బారిన వంద గ్రామాలు



బొబ్బిల్లంక అశోక్ నగర్ వద్ద కోతకు గురైన ఏటిగట్టు

సీతానగరం: అఖండ గోదావరి వరద నుంచి కాపాడే ఏటిగట్టుకు రక్షణ కరువైంది. బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి జాలిమూడి శివారు వరకూ ఏటిగట్టు బలహీనపడింది. గోదావరి వరదతో గట్టు కోతకు గురైంది. దీనిపై దృష్టి సారించి రక్షణ చర్యలు చేపట్టించుకోకపోతే వచ్చే ఏటా వరదలకు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అదే జరిగితే వంద గ్రామాలు ముంపు బారిన పడతాయి.

పట్టించుకోకపోతే..

ఈ ఏడాది వరదల కారణంగా బొబ్బిల్లంక అశోక్ నగర్ వద్ద ఏటిగట్టు వరకూ లంకభూమి కోతకు గురైంది. ఇక్కడ తక్షణమే రక్షణ చర్యలు చేపట్టకపోతే గండి పడే ప్రమాదం ఉంది. బొబ్బిల్లంక నుంచి పురుషోత్తపట్నం వరకు ఉన్న ఏటిగట్టు జారి బలహీన పడింది. ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు ఇసుక బస్తాలు వేసి వదిలేస్తున్నారు. ఇలాగే 2012లో కూడా సీతానగరంలోని లంకూరు, మునికూడలి వద్ద కూడా గట్టు బలహీన పడితే ధవళేశ్వరం నుంచి కూలీలను తీసుకువచ్చి ఇసుక బస్తాలను వేశారు. మరమ్మతులకు అంచనా వేసి వదిలేశారు. అలాగే జాలిమూడి – బొబ్బిల్లంక మధ్య శివాలయం వద్ద కూడా గట్టు బలహీన పడగా అక్కడ ఇసుక బస్తాలతో రక్షణ కలిస్తున్నారు. బొబ్బిల్లంక, జాలిమూడి శివారు వరకు ఏటిగట్టు పూర్తి బలహీన పడిందని ఏజీఎల్ అధికారులు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇది ఇలాగే వదిలేస్తే వచ్చే సంవత్సరం గట్టు కోతకు గురై ఊళ్లనే ముంచెత్తుతుందని చెబుతున్నారు. దీని ప్రభావంతో పురుషోత్తపట్నం, వంగలపూడి, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ళ, ఇనగంటివారిపేట, వెదుళ్ళపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాలు ముంపునకు గురవనున్నాయి.



అశోక్ నగర్ వద్ద నామమాత్రంగా వేసిన రాక్ బౌల్డర్స్



అశోక్ నగర్ వద్ద బలహీన పడిన ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

ముంపునకు గురైతే తేరుకోవడం కష్టం

గోదావరి వరదతో ఏటిగట్టుకు గండి పడితే గ్రామాల్లో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంది. గోదావరి వరద తగ్గుముఖం పట్టిన తరువాత తొర్రిగడ్డ కాలువ ద్వారా బొబ్బిల్లంక స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి నీరు తరలివెళ్లాల్సి ఉంది. దీంతో ముంపులోకి వెళ్లిన గ్రామాలు తేరుకోవాలంటే సుమారు రెండు నెలలు పట్టే అవకాశం ఉంటుంది. అప్పటి వరకు అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు జీవన విధానం అస్తవ్యస్తంగా మారుతుంది.

ఎర్త్ బాండ్స్ పటిష్టతకు చర్యలు

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఏటిగట్టును ఆనుకుని ఉన్న ఎర్త్ బాండ్స్ బలహీనంగా ఉన్నాయని, వీటి మరమ్మతులకు రూ.24 కోట్లు అంచనా వ్యయం తయారు చేయించి డిజాస్టర్ మేనేజ్మెంట్ నుంచి నిధులు మంజూరు చేయించారు. ఆ పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. గత నెల 31వ తేదీన బొబ్బిల్లంక అశోక్ నగర్ వద్ద బలహీనపడిన ఏటిగట్టును మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. ఈ గట్టును ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, ఏజీఎల్‌బీ అధికారులను ఆదేశించారు. 300 లారీలకు పైగా రాక్ బౌల్డర్స్‌ను వేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పడంతో నిధులు మంజూరు చేస్తామని, పనులు చేపట్టాలని ఆదేశించారు. అయితే నిధులు ఇంత వరకూ రాకపోవడంతో పనులు జరగనే లేదు.

చర్యలు తీసుకోకపోతే కష్టం



గోదావరి వరద వస్తే ఏటిగట్టుకు గండి పడే ప్రమాదం ఉంది. గత నెలలో అశోక్ నగర్ వద్ద ఏటిగట్టు కోతకు గురైంది. వరద నీరు గట్టు పక్కకి వచ్చింది. వచ్చే ఏడాది లోపు తక్షణ చర్యలు తీసుకోకపోవతే గండి పడే అవకాశం ఉంది. గ్రామాలు ముంపునకు గురవడమే కాదు ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. అధికారులు చర్యలు చేపట్టాలి.

– వేముల అంజనేయుడు, బొబ్బిల్లంక

ముందే స్పందించాలి



ఏటిగట్టుకు రక్షణ కల్పించకపోతే గండి పడుతుందని అధికారులు అంటున్నారు. గండి పడితే పెద్ద ఎత్తున ఆస్తినష్టం, ప్రాణనష్టం కలిగే అవకాశం ఉంది. గ్రామాలు ముంపులోకి వెళ్లి సుమారు రెండు నెలల వరకు ముంపు నుంచి బయటపడకపోవచ్చు. వరద నీరు బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువ ద్వారా గోదావరిలోకి వెళ్లాలే తప్ప వేరే మార్గం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ముందే స్పందించాలి.

– కూచిమంచి జగన్నాథరావు, ఉండేశ్వరపురం

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సతీష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో వల్లభశెట్టి రామసతీష్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం పరామర్శించారు. సతీష్ మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. మెరుగైన ఆరోగ్యం కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో నల్లమిల్లి బాల మురళీకృష్ణారెడ్డి, ప్రేమలత కొండ, శేఖర్, కొండయ్య, మణికంఠ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియంతలా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం

ఆర్పీసీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా నియంత పాలన చేస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. శనివారం రాజమహేంద్రవరంలో ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలుగా చలామణి అవుతున్న కొన్ని కార్పొరేట్ రాజకీయ పార్టీల కుట్రలో భాగంగానే ఇతర రాజకీయ పార్టీలను వేధిస్తూ రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల గుర్తుల విషయంలో న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వీలు లేదనడం ప్రజాస్వామ్యం విరుద్ధమన్నారు. ఎన్నికల సంఘమే చట్ట నిబంధనల ఉల్లంగిస్తే ఎన్నికల ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేయాలనటం హాస్యాస్పదమన్నారు. ఆర్టికల్ 226 ఉద్దేశాన్ని ఎన్నికల సంఘం వక్రీకరిస్తుందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్నికల సంఘం ముందే బాధితులు మొర పెట్టుకోవాలనడం ఎన్నికల సంఘానికి సబబు కాదన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితం ఎంతో అవసరం



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



వెంకట్రావు దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

రాజానగరం: విధి నిర్వహణలో ఉద్యోగులకు ఎదురయ్యే వివిధ సమస్యలను పరిష్కరించుకోవటంలో యూనియన్ల (సంఘాలు) పాత్ర ఎంతో ఉంటుందని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు తెల్లమేకల వెంకట్రావు అన్నారు. పుణ్యక్షేత్రంలో శనివారం జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో యూనియన్ పతాకాన్ని వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ ప్రతినిధులంతా కలిసి వెంకట్రావు దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి, యూనియన్ స్వర్ణోత్సవ కాయిన్‌ని బహూకరించారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.సుబ్బారావు, పూర్వ గౌరవాధ్యక్షుడు బీవీవీఎస్ చౌదరి, ప్రధాన కార్యదర్శి టి.ఫణి కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పూజలు



సంపరలో ప్రత్యేక అలంకరణలో ఉన్న వేంకటేశ్వరస్వామి వారు

పెదపూడి: సంపర గ్రామంలోని ప్రాచీన ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న పద్మావతి, అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

40 మందికి దంత వైద్య సేవలు



అనపర్తిలో వైద్య సేవల కార్యక్రమం ప్రారంభిస్తున్న వైద్యులు, యాజమాన్యం

పెదపూడి: అనపర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి స్వయంగా ఉచిత దంత వైద్య సేవలు అందించే కార్యక్రమం శనివారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సారథ్యంలో రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ ఆస్పత్రి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచనలతో వైద్య పరీక్షలు నిర్వహించారు. మొదటిగా మండల కేంద్రమైన అనపర్తిలో 40 మందికి దంత వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మెరుగైన పరీక్షలకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి జీఎస్ఎల్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

జెండా ఎగురవేసి.. దేశభక్తిని చాటి..



అనపర్తిలో ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న సతీష్



చక్రద్వారబంధంలో ర్యాలీ నిర్వహించిన దృశ్యం

పెదపూడి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో అనపర్తి గ్రామానికి చెందిన సనాతన ధర్మ పరిరక్షణ సమితి కార్యదర్శి రెడ్డి సతీష్ జాతీయ జెండా ఎరుగువేసి దేశభక్తిని చాటుకున్నాడు.

చక్రద్వారబంధంలో ర్యాలీ

రాజానగరం: ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా చక్రద్వారబంధంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యపరుస్తూ జాతీయ జెండాల పట్టుకుని గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి, ఎన్డీఏ ప్రభుత్వాలు రాష్ట్రంలోను, కేంద్రంలోను ప్రజా సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పంచాయతీ, గ్రామ సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

మాకూ పింఛన్లు ఇవ్వండి

రాజవరం జనవాణిలో ఎమ్మెల్యే బత్తులకు స్థానికుల వినతి

మధురపూడి: మాకు పింఛన్లు ఇవ్వండని కోరుకొండలోని రాజవరంలో శనివారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు వినతి పత్రాలు అందజేశారు. అర్హుత కలిగినవారికి పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జనవాణి కార్యక్రమం మండలంలోని రాజవరం, కణుపూరు, గ్రామాల్లో జరిగింది. కార్యక్రమంలో కోరుకొండ ఎంపీడీఓ హేమ సువదర్, నాయకులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవం దెబ్బతీస్తే ఊరుకోం

- స్మృతివనంపై దాడికి నిరసన
- సీతానగరం ఎంపీపీ గుర్రాల జోత్స్న



సీతానగరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ గుర్రాల జోత్స్న

మధురపూడి: దళితుల ఆత్మగౌరవం దెబ్బతీస్తే ఊరుకోమని సీతానగరం ఎంపీపీ గుర్రాల జోత్స్న అన్నారు. విజయవాడ నడిబొడ్డులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంపై దాడిని నిరసిస్తూ శనివారం సీతానగరం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ అంబేడ్కర్ అంటే దళితుల ఆత్మగౌరవమని, మా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్మృతివనంపై దాడి సంఘటనలో పాల్గొన్న పోలీసులపై దళిత హోమ్‌శాఖ మంత్రి మాట్లాడకపోవడం దళిత జాతికే అవమానం అన్నారు. దీనికి ముందు సీతానగరంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు సాదే చంటిబాబు, మద్ద విజయ్‌కుమార్, ఈతకోటి వెంకట్, గుర్రాల బోడియ్య తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

రాజానగరం: విజయవాడ స్మృతివనంలోని అంబేడ్కర్ విగ్రహానికి జరిగిన అవమానాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు జరిగిన అవమానానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలని, దేశానికే సిగ్గు సిగ్గు, దోషులను కఠినంగా శిక్షించాలనే నినాదాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయాలని ధర్నా

కంబాలచెరువు: వెంటనే మూడు నెలల జీతాలు మంజూరు చేయలని ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్‌కు మూడు నెలలుగా జీతాలు అందలేదని, వారి ఇల్లు గడవడం కష్టంగా మారిందన్నారు. ఈ రోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్‌లో ఉన్నా ఇల్లు ఖాళీ చేయమంటున్నారని, చాలీచాలని జీతాలతో బతకడం కష్టమని వెంటనే జీతాలు అందించాలన్నారు.

రాజమహేంద్రవరం ఖ్యాతి జాతీయ స్థాయికి వెళ్లాలి

ప్రకాశంనగర్: క్రీడల ద్వారా రాజమహేంద్రవరం కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని రాష్ట్ర పర్యాటక సంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. శనివారం రాజమహేంద్రవరం ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలోని క్రికెట్ గ్రౌండ్స్‌లో బజాజ్ గ్లాడియేటర్స్ కార్పొరేట్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణతో పాటు మనస్సుకు ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. రాజమహేంద్రవరంలో కార్పొరేట్ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, గవర్నమెంట్ ఉద్యోగుల శారీరక మానసిక ఉల్లాసాన్ని ఇచ్చేందుకు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 2027 పుష్కరాలు నాటికి రాజమహేంద్రవరంలో ఆడిటోరియం, క్రీడా మైదాన ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లతో చర్చించి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టోర్నమెంట్ కప్పును ఆవిష్కరించారు. టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ మాట్లాడుతూ ఈ కార్పొరేట్ లీగ్ క్రికెట్ 2024 టోర్నమెంట్‌లో 8 టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇన్సూరెన్స్ – 11, ఎస్బీఐ–11, కలెక్టర్ – 11, పోలీస్ – 11, ఎన్జీవోస్ – 11, ఎలక్ట్రికల్ –11, లాయర్స్ –11, సీఏ – 11 టీంలు పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు, ఏఆర్‌డీ చీఫ్ ఎస్పీ చెంచు రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు జయ కిషన్, సతీష్, ప్రభాకర్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఇండియన్ ఐకాన్ పురస్కారం

- ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవార్డులు
- మంత్రి కందుల దురేష్ చేతుల మీదుగా ప్రదానం



పురస్కారాలు అందుకున్న విశిష్ట రంగాల్లో ప్రముఖులు

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాలకు చెందిన విశిష్ట రంగాల్లో ప్రతిభావంతులైన 25 మందికి ఇండియన్ ఐకాన్ 2024 అవార్డులు ప్రదానం చేశారు. శనివారం స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాల్లో ప్రముఖ సంఘసేవకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షతన ప్రవాస భారతీయ నృత్యకారి రొయ్యూరు అశ్రిత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల ప్రాణ త్యాగం వల్ల మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని వారి స్ఫూర్తితో మనమందరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సైన్స్–టెక్నాలజీ, సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవ, కళారంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి, వారికి ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా ఇండియన్ ఐకాన్ 2024 అవార్డులు అందించడం అభినందనీయమని అన్నారు. అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ గోదావరి జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజయోనా మాట్లాడుతూ తమ సంస్థ ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన సాహిత్య, సాంస్కృతిక, సామాజికాభ్యుదయ వాదులు, కళాకారులను గుర్తించి అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ప్రదానం చేశామని తెలిపారు. అంతర్జాతీయంగా మలేషియా, దుబాయ్, థాయిలాండ్ వంటి విదేశాలలో సైతం ప్రవాస తెలుగు సంఘాల సౌజన్యంతో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీలో హర్ ఘర్ తిరంగా



సత్యదేవ నర్సరీలో జెండాను ఎగురవేస్తున్న అధికారులు, నాయకులు, నర్సరీ రైతులు

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీలో శనివారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి పోసిన వెంకటచలం, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సుజాత, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దుర్గేష్, మండల రెవెన్యూ అధికారి పోసిబాబు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ పాల్గొని జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాంత్ర్య పోరాటం, జాతీయ జెండా స్ఫూర్తి, దేశ భక్తి తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, అధికారులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.